# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

# ప్రత్యేక అభివందనములు

మా తండ్రి అప్పారావు గూటం గారి మరణ వార్త విని మమ్మును ఓదార్చుచు అనేక ఆదరణకరమైన మాటలను వ్యక్తిగతంగాను, ఉత్తరాలు, టెలిఫోన్లు, టెలిగ్రాంల ద్వారా తెలియ జేసిన క్రీస్తునందలి సోదర సోదరీలకు, మిత్రులకు, బంధువులకు ఈ పత్రికా ముఖముగా మా కృతజ్ఞతాభివందనములు తెలియ జేయుచున్నాము. అనేకులు మా తండ్రిగారిని ప్రసంసిస్తూ వ్యాసములను, గేయములను పంపించారు. అవన్నీ ముద్రించుటకు స్థలము చాలదుగాని చివరిగా ఆయన రెండవ కుమార్తె హెప్సీ కాంతి కుమారి వ్రాసిన ఈ దిగువ కావ్యాన్ని ప్రచురించగలుగుచున్నాము.

— జాషువా గూటం.

# మరపు రాని మహా మనీషి మా నాయన

మమతాను రాగాలతో జన్మనిచ్చి
ప్రార్థనా విజ్ఞాపనలతో మముపెంచి
క్షమనిచ్చి శ్రమకోర్చి పెద్దజేసి
శ్రవ్యమైన రీతిలో నవ్య భవితవ్యానికి
మా జీవితాలను నడిపించి
నరనరాలలోని మీ ప్రేమానురాగం
క్షణక్షణం మాకోసం పంచి యిచ్చి
పరిశుద్ధ గ్రంథ మాధుర్యాన్నే గాక
తరతరాల చరిత్రను మాకు వినిపించి
అజాత శత్రువై అనురాగ పితృవై
అలమటించే వారికి ఆపద్బాంధవై
అనుక్షణం కర్తవ్య నిర్వహియై
రోగశయ్యపై సయితం పరమవైద్యుడు
ప్రభు యేసుక్రీస్తుని ప్రకటిస్తూ
సర్వకాల సకలావస్థలలోనూ సర్వశక్తునే సేవిస్తూ, ధ్యానిస్తూ
మాట మాంద్య మొచ్చి గొంతుపూర్తిగా
మూగబోడానికి కొద్ది ముందుగా
తోటి మిత్రునితో చిననాటి ముచ్చట్లు చెబుతూ
"విశ్వాసమే విజయం బది
సంచిత మరణము నానందముగ గాంచు"
నంచు గళమెత్తి గానముచేసిన మీ విశ్వాస
ఘనతను ఎలా మరువగలము?
మీ ఎనుబది రెండేండ్ల జీవితంలో
ఏబదినాలుగేండ్లు ఒకే బైబిలును

[ తరువాయి దైదిలు 4వ పేజీలో చూడుడు ]

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - 80, కాకినాడ - 533 001

ఎడిటర్ : మేనేజింగ్ ఎడిటర్ :

జె. సి. ఛోట్ జాషువా గూటం

సంచిక 9 ఏప్రియల్ 1986 సంపుటి 6


## సంపాదకీయము

### వల్లించుటద్వారా నేర్చుకొనుట

***(Learning Through Repetition)***

మనం చాల తెలివైనవారమని మనలో చాలమంది అనుకొంటాము. ఏదైనా మొదటిసారిగా వింటే దానిని జ్ఞాపకముంచుకో గలమని, తిరిగి వల్లించగలమని అనుకొంటాము; ఎందుకంటే మనం చాల తెలివి గల వారము. మనమెంత తెలివైన వారమయినను, ఒక సంగతిని పదే పదే వినుటవలన లేక వల్లించుటవలన దానిని గూర్చి మనం ఎరుగుదుము. ఏదైనా క్రొత్త విషయం మనకు జ్ఞాపకముండాలంటే దాన్ని కంఠస్థముచేసి వల్లించాలి. అలాగే మన ఆలోచనలు, జీవితాలలో మార్పు అవసరమైన సంగతులను గూర్చి విన్నప్పుడు వాటిని కంఠస్థము చేసికొని జ్ఞాపకముంచుకోవాలి. ఆత్మీయ విషయాల్లో ఇది మరింత ముఖ్యము.

చిన్న బాలుడు భాష నెట్లు నేర్చుకొంటాడు? ఎవరైనా ఒక క్రొత్తభాష నెట్లు నేర్చుకొంటారు? లెక్కలు, సైన్సు, వర్ణక్రమము మొదలగు వాటి సంగతి యేమిటి? మెకానిజమ్ గాని, డ్రైవింగ్ గాని

లేదా అట్టి వెయ్యి సంగతులు గాని ఒకడెట్లు నేర్చుకొంటాడు? ఏదైనా సరే, ఒక సబ్జక్టు గాని, లేదా వృత్తి గాని పదే పదే చెప్పుట వలన, చేయుట వలన అలవడతాది. అట్లే నేటి మానవుని యెడల దేవుని చిత్తాన్ని గూర్చి తెలిసికోవడం కూడాను. కొందరు దానిని ఒకసారి చదువుతారు, లేదా వింటారు. ఆ తరువాత దానిలో పండితులమై పోయామని అనుకొంటారు. దేవుని వర్తమానము చాల సింపుల్ గా యున్నను, చాలమంది ఆ సింపుల్ గాయున్న దానిలోనే బోల్తా పడు చున్నారు. అది అంత సూక్ష్మంగా గాక చాల కష్టంగాను, కఠినం గాను యుండాలని వారనుకొంటారు. అయితే అది అట్లు లేనేలేదు. మానవుడు దేవుని చిత్తాన్ని తెలిసికోవాలని ఆయన కోరాడు. అందు వలన అందరు చదివి, గ్రహించుకొని, విధేయత చూపగలిగే వర్త మానాన్ని ఆయన యిచ్చాడు. అసత్య భావాలు, మానవ కల్పిత ఉపదేశాలవలననే అనేకులు గజిబిజి అయిపోవుచున్నారు.

మానవుల నుపదేశించడానికి, వారికి జ్ఞప్తి తేవడానికి బైబిలు దేవుని క్రియలను ఫలదాయకంగా వల్లించుచున్నది. ఉదాహరణకు పాత క్రొత్త నిబంధనలను చదువునపుడు దేవుడు తన ప్రజలను బాని సత్వమునుండి విడిపించుట కేమిచేసాడో పలుమారులు కనుగొనగలవు. క్రీస్తు పాతనిబంధన లేఖనములను పలుమారులు ఎత్తి చూపించాడు. అందులో "మీరు వినుటమట్టుకు విందురుగాని గ్రహింపనే గ్రహింపరు, చూచుటకుమట్టుకు చూతురుగాని యెంతమాత్రము తెలిసికొనరు" అనునదొకటి (మత్త 13:15). అంటే వారు చూస్తూ వినుచూయున్నారు గాని వారు దానిని గ్రహింపక యున్నారు. వారు గ్రహించుకోలేక కాదు గాని, వారు గ్రహింపనొల్లక యున్నారు.

యేసు తరచు ఉపమాన రీతిగా బోధించాడు (మత్త 13:3). మత్తయి మార్కు లూకా యోహానులు క్రీస్తుకు సాక్షులు. వారా యన భోధను విన్నారు, అద్భుతాలను తిలకించారు, వారాయన

మరణ సమాధి పునరుత్థానములను గూర్చి కూడ చెప్పారు. గనుక వారు వ్రాసిన సువార్తలను చదువుచుండగా, ఆ నలుగురు విని గ్రహించిన రీతిగా ఒక్కొక్క సంగతి ఆ నాలుగు సువార్తలలోను కనబడతాది. క్రైస్తవ్యము వ్యాప్తి చెందిన విధానాన్ని అపొస్తలుల కార్యముల గ్రంథము మనకు తెలియజేయు చున్నది. దానిలో మార్పు జెందిన వారి సందర్భములు 11 ఉన్నాయి. అపొ. కా. 9వ అధ్యాయములో పౌలు మార్పుజెందుటను గూర్చి వ్రాయబడింది. 22వ అధ్యాయములో పౌలు చెప్పిన స్వీయ చరిత్ర యున్నది. అట్లే 10వ అధ్యాయములో కొర్నేలీ, అతని యింటివారు మార్పుజెందుటను గూర్చి వ్రాయబడి యున్నది. 11వ అధ్యాయములో అదే సంఘటనను పేతురు మరల వర్ణించాడు. అయితే లేఖనములు విసికించుచున్నాయా? మత్తయి, మార్కు లూకా యోహాను సువార్తలలో వ్రాయబడిన క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములను గూర్చి చదువునపుడు నీవు విసుగెత్తి పోతావా? అపొస్తలుల కార్యములు చదివేటప్పుడు యేమి? లేదా పౌలు ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు, కొలస్సయులకు ఒకే సంగతులను, వ్రాయుచున్నట్లుండగా ఆ పత్రికల సంగతి యేమిటి? అవి విసుగు పుట్టించేవి కావు. సరిగదా అవి జ్ఞానం కలిగించేవి, హెచ్చరించేవి, మనోహరమైనవి.

మన సమస్య యేమిటంటే వాటిని చదువవలసినంతగా చదువము. బైబిలు తరగతులకు వెళ్ళేటప్పుడు, మనం సాధారణంగా ఎరిగిన అంశములనే పఠించుటకు ప్రయత్నిస్తాము. బోధనుగూర్చి, బైబిలు తరగతులనుగూర్చి, మొదలగువాటినిగూర్చి దేవుడు చెప్పినదాన్ని మనం జ్ఞప్తికి తెచ్చుకోవాలి. పేతురు తన సమకాలికులైన క్రైస్తవుల కిట్లు చెప్పాడు: "కాబట్టి మీరు ఈ సంగతులను తెలిసికొని మీ రంగీకరించిన సత్యమందు స్థిరపరచబడి యున్నను, వీటిని గూర్చి ఎల్లప్పుడును మీకు జ్ఞాపకము చేయుటకు సిద్ధముగా ఉన్నాను. మరియు మన ప్రభువైన యేసుక్రీస్తు నాకు సూచించిన ప్రకారము నా గుడా

రమును త్వరగా విడిచిపెట్టవలసి వచ్చునని యెరిగి, నేను ఈ గుడారములో ఉన్నంత కాలము ఈ సంగతులను జ్ఞాపకము చేసి మిమ్మును రేపుట న్యాయమని యెంచుకొనుచున్నాను. నేను మృతి పొందిన తరువాత కూడ మీరు నిత్యము వీటిని జ్ఞాపకము చేసికొనునట్లు జాగ్రత్త చేతును" (2 పేతురు 1:12-15). అతడు మరల ఇల్లు చెప్పాడు: "ప్రియులారా, యీ రెండవ పత్రిక మీ కిప్పుడు వ్రాయుచున్నాను. పరిశుద్ధ ప్రవక్తలచేత పూర్వమందు పలుకబడిన మాటలను, ప్రభువైన రక్షకుడు మీ అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకము చేసికొనవలెనను విషయమును మీకు జ్ఞాపకము చేసి, నిర్మలమైన మీ మనస్సులను రేపుచున్నాను" (2 పేతు 3:1, 2). దేవుని చిత్తాన్ని తిరిగి పేతురు వారికి జ్ఞాపకము చేయాలని కోరుచున్నాడు. అవును వారు దేవుని చిత్తాన్ని ఎరిగినవారే. సత్యాన్ని పదేపదే విన్నవారే, గాని మానవుడు తేలికగా మరచిపోతాడు. అతడు వినిన సంగతులను అతనికి జ్ఞాపకము చేయబడుతు యుండాలి. అతనికి జ్ఞాపకం చేయబడకపోతే, అతడు దేవునినుండి తొలగిపోయి నాశనమౌతాడు.

బైబిలు కరస్పాండెన్సు కోర్సులోని పాఠాలను పొందువారు, అవి బహు తేలికగా యున్నాయని చెబుతారు; గాని వారి కియ్యబడిన ప్రశ్నలకు జవాబిచ్చేటప్పుడుమాత్రం తప్పులు వ్రాస్తారు. ఒక్కోసారి మనం అనుకొన్నంత తెలివిగలవారం కాకపోవచ్చును.

రక్షింపబడాలంటే ఒకడు ఏమి చేయాలో బైబిలు చెప్పు దానిని గూర్చి అనేకమందికి నేను వ్యక్తిగతంగా బోధించాను. బైబిలు బోధించు సంఘాన్ని గూర్చి కూడ వారికి విపులంగా బోధించాను. అయినను ఒక వారం తరువాత వారిని కలిస్తే ఈ సంగతులను వారెన్నడు వినలేనట్లు ప్రవర్తిస్తారు. ఆయా సంగతులను గూర్చి పూర్వం వారెట్టి భావాలను కలిగి యున్నారో వాటినే వ్యక్తపరుస్తారు. నేను వారికి ఉపదేశించేటప్పుడు సత్యాన్ని గ్రహించినట్లు వారనుకొన్నారు,

గాని గ్రహించలేదు. వారు సత్యాన్ని విన్నారు, మంచిదనిపించింది గాని అది వారి మనసులో నాటుకోలేదు. అంటే అదే పాఠాలను వారు పదేపదే పఠించాలి లేదా వారికి ఉపదేశించాలి. అట్లు చేయడంలో వారు చివరికి సత్యాన్ని గ్రహించి, విశ్వసించి, ఆయనకు విధేయత చూపగలరు.

బైబిలును కొంచెమట్టుకే చదివి, లేదా బైబిలు ఉపదేశాలను కొంతమట్టికే విని, అంతా నాకు తెలుసన్నట్లు నీవు ప్రవర్తించవని నా విశ్వాసము. నీవు దీర్ఘముగా పఠించి, బాగుగా విని నీలో పూర్ణ విశ్వాసము వచ్చువరకు సత్యాన్ని అన్వేషించి అప్పుడు ప్రభువు చిత్తానికి లోబడుము. నీవట్లు చేసినప్పుడు ప్రభువుకు హృదయపూర్వకముగా లోబడిన వాడవగుదువు (రోమా 6:17, 18). హృదయపూర్వకముగా సత్యానికి లోబడినందున ప్రభువుకు నమ్మకమైన జీవితం జీవించగలవు. చివరకు పరిగణించబడేది నీ విశ్వాసమే.

---

## క్రైస్తవ ఔన్నత్యము

"మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు." 1 పేతురు 2:9. "స్త్రీలు కనినవారిలో బాప్తిస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. అయినను పరలోక రాజ్యములో అల్పుడైనవాడు అతని కంటె గొప్పవాడు" మత్తయి 11 : 11. "మీరు జీవవాక్యమును చేతపట్టుకొని, లోకమందు జ్యోతులవలె కనబడుచున్నారు" ఫిలిప్పీ 2 : 16 "మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినై యుందును. మీరు నాకు

కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" 2 కొరింథీ 6 : 18. ఈ ఆధిక్యతలన్నియు క్రీస్తు ప్రభువు తనను విశ్వసించిన వారికి అనుగ్రహించినవి.

క్రైస్తవ జీవితము ఒక ప్రత్యేకమైన జీవితము. చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన వెలుగులోని పిలువబడిన జీవితము. అదొక నూతన సృష్టి. నవీన స్వభావమును ధరించుకొని, క్రీస్తును ఆనుకొని, ఆయనను ఆశ్రయించిన పరిశుద్ధమైన మార్గము. "నీ శత్రువులను ప్రేమించుడి" అని లోకమునకు చాటిచెప్పిన ప్రభువు నామమును ధరించిన జీవితము. చీకటినుండి విడుదలపొందిన జీవితము. "ఏ శిక్షావిధియు లేని" జీవితము.

చీకటి అనునది మానవునికి బాధకరమైనది. ఎదుట నున్న వస్తువును గుర్తుపట్టలేని స్థితి చీకటి. మార్గమున నడచుటకు వీలుకాని స్థితియైయున్నది. ఆరోగ్యకరమైన నేత్రములు కలిగియున్నను చూడ లేని స్థితి. ఇట్టి స్థితిలో ఉన్న మానవుడు కొద్దిపాటి వెలుగును చూచి ఆనందపడును.

ఆత్మీయమైన చీకటిలోనున్న మానవులను దేవుడు ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచి, వారిని ఏర్పరచబడిన వంశముగాను, రాజులైన యాజక సమూహముగాను, పరిశుద్ధ జనముగాను, తన సొత్తయిన తన ప్రజలనుగాను చేసికొనెను.

"సర్వశరీరులు గడ్డిని పోలినవారు" 1 పేతురు 1:24. ఈ వాక్య భాగము మానవుని శారీరక స్థితిని గూర్చి తెలియజేయునది. ఆత్మ విలువైనది. అక్షయమైనది. ఇట్టి మానవులకు "చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందున్నది". ఇది క్రైస్తవులకు, అనగా మరణమువరకు నమ్మకముగ నున్న క్రైస్తవులకు మాత్రమే. ఇది క్రైస్తవ ఔన్నత్యము.

క్రైస్తవ జీవితము ధైర్యము కలిగిన జీవితము. "చావైతే

లాభము" అని చెప్పగలిగిన జీవితము. మరణమునుగూర్చి చింతపడని జీవితము. "శ్రమ నొందియుండుట నాకు మేలాయెను" అని చెప్పగలిగిన జీవితము.

ప్రపంచ చరిత్ర పేజీలలో ఎచ్చట ఇటువంటి మాటలు (Statements) పలికిన మనుష్యులను మనము చూడలేము. బైబిలు నందు మాత్రమే చూడగలము. ఇదే క్రైస్తవ ఔన్నత్యము,

— E. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

బైబిలు పాఠము :

## దేవుని గూర్చిన సత్యము

### 1. దేవుడున్నాడనుటకు ఆధారములు.

I ఉపోద్ఘాతము :

A. "దేవుడు" అను పదమునకు అర్థము = సర్వశక్తిగలవాడు.
"ఎల్" హెబ్రీ పదము.
"థియోస్" గ్రీకు పదము.

B. దేవుని ఎందుకు తెలిసికొనవలెను?
అపొ. 17:25 - తన్ను తెలిసికొనవలెనని దేవుడు కోరుచున్నాడు. యోహా 17:3 - నిత్యజీవము పొందుటకు.
దేవుని తెలిసికొనవలెనని సహజమైనకోరిక మనిషికి కలదు.
దేవుని తెలిసికొననివాడు జీవితములో గురిలేనివాడు.

C. దేవుని తెలిసికొనుటకు మానవ మార్గములు:

1. ధ్యానమార్గము - తపస్సు ద్వారా దేవుని తెలిసికొనవలెనని ఋషులు ప్రయత్నించిరి.
2. జ్ఞాన మార్గము - చార్వాకులు గ్రీకులు - జ్ఞానముద్వారా తెలిసికొనగలమని భావించిరి.
వీరు - ధ్యాన మార్గమును ఖండించిరి.

3. ప్రత్యక్షవాదము - కంటికి కనబడు దానిని, తన కంటె శక్తిగల దానిని దేవుడు అని భావించిరి.

ఉదా : తలిదండ్రులు, ఉపాధ్యాయులు, సూర్యచంద్ర గోళములు, భూమి, నీరు, గాలి, అగ్ని, కొన్ని వ్యాధులు మొ॥

ఫలితము : దేవుని తెలిసికొనలేదుగాని - దేవుళ్లను సృష్టించుకొనిరి - 1 కొరింధీ 1 : 20-21; రోమా 1 : 21-23.

II పాఠము.

దేవుని తెలిసికొనుటకు దేవుని మార్గము :

A సృష్టి, రోమా 1:19-20, కీర్త 19:1-2, యోబు 12:7-9.

1. సృష్టి పరిణామము చెందలేదు.
2. సృష్టిని మానవుడు సృష్టించలేదు.
3. సృష్టి దానంతట అది రాలేదు.
4. ప్రతి వస్తువు వెనుక నిర్మాణకుడున్నాడు.
5. ఈ సృష్టి వెనుక సృష్టికర్త వున్నాడు.

B సృష్టిలోని క్రమ బద్ధత :

1. గృహామునుగాని, పాఠశాలనుగాని, వాహనమునుగాని నడిపించువారు కలరు.
2. సృష్టి కొన్ని వేల సంవత్సరములనుండి క్రమము తప్పకుండా కొనసాగుచున్నది.
3. గ్రహాములను వాటి పరిధిలో నడిపిస్తున్నది ఎవరు ?
4. ఋతువులను క్రమ పరుస్తున్న దెవరు ?
5. మనం భుజించు ఫలములలో రుచి వుంచిన దెవరు ?
6. మానవుడుకాదు. సర్వశక్తిగల దేవుడే నడిపించుచున్నాడు.

C మానవుడు కీర్త 139 : 13-15, అపొ. 17 : 25, 28, 29, యోబు 11 : 10-11.

1. మానవుడు పరిణామము చెందలేదు.
2. మానవుని మానవుడు నిర్మించలేదు.
3. మానవుడు తనంతట తాను రాలేదు.
4. మొట్టమొదటి మానవుని దేవుడు తన పోలికలో సృష్టించెను.
5. మానవ దేహములోని ఏ భాగమును మానవుడు తయారు చేయలేడు.
6. బొమ్మను చేసి - ఆత్మనుంచలేడు.
7. మహాశక్తి సంపన్నుడైన దేవుడే మానవుని సృష్టించెను.

D. క్రీస్తు. యోహాను 1 : 18.

1. క్రీస్తు లోకమునకు రాలేదని ఎవరూ చెప్పలేరు.
2. క్రీస్తు దేవునితో కూడా వుండి - శరీరధారిగా వచ్చెను. ఫిలి 2 : 6-7.
3. దేవుని చూచి వచ్చినవారు చెప్పితే నమ్ముతామన్నవారు క్రీస్తు సాక్ష్యమును నమ్మవచ్చును.
4. క్రీస్తు దేవుని బయలు పరచెను.
   a) ఆయన బోధ ద్వారా క్రీస్తు దేవుని గూర్చి బోధించెను.
   b) ఆయన జీవితము ద్వారా క్రీస్తు దేవుని స్వభావమును కనపరచెను. యోహా 14:8-9.
5. క్రీస్తు కల్పితముకాదు. ఆయన దేవుని యొద్ద నుండి వచ్చి దేవుని బయలు పరచెను.

E. బైబిలు. 2 పేతురు 1:20-21. 2 తిమో 3:16-17.

1. బైబిలు దేవుడున్నాడనుటకు గొప్ప ఆధారము.
2. బైబిలులోని 66 పుస్తకములను, 40 మంది గ్రంథకర్తలు 1600 సం॥ కాలములో వ్రాసిరి. వీరు ఆయాదేశములకు,

ఆయా బాషలకు, ఆయా సంప్రదాయములకు, ఆయా విద్యలకు, ఆయా స్థితులకు సంబంధించిన వారైనను ఏకాభిప్రాయము కలిగియుండిరి.

3. బైబిలు గ్రంథకర్తలు ఒక్క దేవునిచేత ప్రేరేపించబడి వ్రాసిరి.

4. బైబిలు దేవుని గ్రంథము.

III ముగింపు :

A. పై కారణములను బట్టి దేవుడున్నాడని గ్రహించగలము.

B. వంశ పారంపర్యముగా దేవుని నమ్మనవసరము లేదు. వ్యక్తిగతముగా తెలిసికొనవలెను.

C. దేవుని తెలిసికొనుట మన బాధ్యత.

D. ఇటువంటి ఆధారములున్నా "దేవుడు లేడు" అనువాడు బుద్ధిహీనుడు. కీర్తనలు 14:1, 53:1, 10:4.

E. "దేవుడున్నాడు" అని నమ్మితే ఆయన ఎవరు? వచ్చే నెలలో చదువుదాము.

బి. జాషువా, ఏలూరు.

---

## స్థానిక సంఘము - నా పాత్ర

## (The Local Church _ My Role)

సంఘము అనుపదము బైబిలునందు రెండు భావములతో కనిపించుచున్నది. అవి 1) సార్వజనికము 2) స్థానికము. మత్తయి 16:18లో క్రీస్తు పేతురుతో ఇట్లనెను: "ఈబండమీాద నా సంఘమును కట్టుదును." ఈ వాక్యములోనే సార్వజనికము (Universal) అను భావము కనిపించుచున్నది. అనగా ఈలోకములో ఎక్కడైనను సంఘమున్న యెడల అది బైబిలు ప్రకారమైన సంఘమైన యెడల, అది నేను కట్టు

దునని క్రీస్తు చెప్పిన సంఘమైయుండును. "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి." రోమా 16:16. ఈ వాక్యములో-వేర్వేరు చోట్ల నున్న స్థానిక క్రీస్తు సంఘములు (Local Congregations) అను భావము కనబడును. ఉదా : కొరింధులో నున్న సంఘము, ఫిలిప్పీలోనున్న సంఘము (I కొరిం 1:2; ఫిలిప్పీ 1:1).

వాక్యమునకు విధేయుడవగుట ద్వారా నీవు క్రీస్తుసంఘ సభ్యుడవు అయితివి: అనగా నీవుండు ఊరిలో ఉన్న స్థానిక క్రీస్తు సంఘ సభ్యుడవగుదువు.

నీవు, నేను స్థానిక సంఘమునందు ఎంతో ప్రాముఖ్యమైన వారము అందువలన మన నియమిత స్థానమునుండి తప్పించుకొనరాదు ప్రతిక్రైస్తవుడు తానున్న స్థానిక సంఘమును గూర్చి గర్వపడవలయును. స్థానిక సంఘమును గూర్చి అతిశయపడవలెను (I కొరిం 11:2) స్థానిక సంఘము ఎడల చింత కలిగియుండవలెను ( II కొరిం 11 : 28).

ప్రభువునందలి ఆశీర్వాదములను స్థానిక సంఘము నీకు అందజేయును. ఆ ఆశీర్వాదములు –

1) ఒకరి యెడల ఒకరికి సహవాసము (అపో.కా. 2 : 42-47)
2) ప్రేమ, క్షేమాభివృద్ధి, ఆత్మీయ ఆనందము (ఎఫెసీ 4:15,16)
3) ఆరాధన ద్వారా ఆనందము (అపో. కా. 20:7, ఫిలిప్పీ 4:4)
4) శోధనలలో ఆదరణ (I థెస్స 5:18)
5) ప్రోత్సాహము (హెబ్రీ 10 : 25)

పై ఆశీర్వాదములను మనము పొందుట ద్వారా స్థానిక సంఘమునందలి మన పాత్రను లేక బాధ్యతను గుర్తించవలయును.

స్థానిక సంఘమునందు ప్రతిసభ్యుడు అనగా నీవు, నేను ముఖ్యులమే.

"సంఘము అను శరీరమునకు క్రీస్తు శిరస్సు" (కొలస్స 1 : 18). శరీరమందలి అవయవములు అవి చిన్నవైనను, పెద్దవైనను ఎట్లు ప్రాముఖ్యతను కలిగియున్నవో అట్లే ప్రతిసభ్యుడు ముఖ్యుడే. యెరూషలేము గోడలను తిరిగి నిర్మించుటకు ప్రతిమనుష్యుడు అవసరమాయెను. అట్లే ఆత్మీయమైన సీయోనును కట్టుటకు ప్రతిసభ్యుడు అవసరమై యున్నాడు. (హెబ్రీ 12:22-23). యెరూషలేము గోడలను కట్టుటలో ఇశ్రాయేలీయుల యొక్క ప్రతి కుటుంబము తోడ్పడెను. వారి వారి పాత్రలను (Roles) వారు చేయదగు పనిచేసిరి. (నెహెమ్యా 3 అధ్యా 4 : 21-23 వరకు).

సంఘములో పెద్దలు, పరిచారకులు, బోధకులు ఉందురు. వారు తమకు అప్పగించబడిన పనినిబట్టి వాక్యానుసారముగా నడచుకొనవలెను. 1 కొరిం 16:2; రోమా 12:3-8 వచనములలోని వ్యక్తులపై ఎటువంటి బాధ్యత మోపబడినదో గమనించుము. ఒక గాలిపటము నెగురవేయుటలో దారము, పుల్లలు, కాగితము అవసరము. వీటిలో ఏది లేకున్నను గాలిపటమును ఎగురవేయలేము. వాటి పని అవి చేసినచో గాలిపటము ఎగురగలదు. అలాగుననే స్థానిక సంఘమునందు ప్రతి సభ్యుడు ముఖ్యమయినవాడు.

వ్యక్తిగత సభ్యునిగా నీవు, నేను స్థానిక సంఘమునకు ఋణపడియున్నాము. మనము కుటుంబములో ఉన్నందున ఆ కుటుంబమునకు అచ్చియుందుము. రాజ్యంలో పౌరునిగా ఉన్నందున ఆ రాజ్యమునకు అచ్చియుందుము. అలాగుననే సంఘమునకు మనము ఋణపడియున్నాము. సంఘమునందలి ఆనందమును మనము పొందుచున్నాము. క్రీస్తునందలి సహవాసము దీనిద్వారా పొందుచున్నాము. గనుక స్థానిక సంఘమునకు మనము ఆర్థికముగా తోడ్పడవలయును. వ్యక్తిగత సభ్యులుగా నీవు, నేను స్థానిక సంఘమునకు ఎట్లు తోడ్పడగలము?

1. వ్యక్తిగత శ్రద్ధ, నిలకడ, బాధ్యతాభావము వీటిద్వారా :

ఆదివారమున జరుగు ఆరాధనకు (స్థానిక సంఘమునందు) తప్పక హాజరగునట్లు బాధ్యత వహించుట (హెబ్రీ 10:25). ఇతరులను నీ వెంబడి ఆరాధనకు తీసికొని రావలెను. దాని అభివృద్ధికి పాటుపడవలెను. సంఘము అభివృద్ధిచెందినదో లేక క్షీణించినదో అను ప్రశ్న నీవ్యక్తిగత ప్రవర్తనపై ఆధారపడి యున్నది.

2. స్థానిక సంఘపు ప్రతివిధమైన పనికి సహకరించుటద్వారా

ఆదిమ సంఘములోని సభ్యులు ఆశ్చర్యకరమైన సహకారము చేసిరి (అపొ.కా. 4:32-35). "మనము జతపనివారమై యున్నాము" (ఫిలి. 1). ఈ మాట ఒకరితో ఒకరు కలసి పనిచేయవలసినదిగా బోధించుచున్నది. సంఘమునకు అండగా యుండవలెను. పెద్దలతో సహకరించుట, సువార్త కూటములకు హాజరగుట మొ॥వి చేయుచుండవలెను.

3. ఇతరులను క్రీస్తునొద్దకు నడిపించుటద్వారా

సంఘ అభివృద్ధికి నీవు చేయవలసిన ముఖ్యమైన పని ఇది. దారి తప్పిపోయిన వారికొరకు ప్రార్థనచేసి క్రీస్తునొద్దకు నడిపించవలెను. ఫిలిప్పు అంద్రెయ అను క్రీస్తు శిష్యులు తాము మాత్రమే కాదు, ఇతరులు శిష్యులుగా ఉండవలెనని కోరుకొన్నారు (యోహాను 2:40-42, 45).

4. కానుకలను క్రమముగా ఇచ్చుటద్వారా

అందరు చందాలు ఇవ్వవలెనని దేవుడు కోరుచున్నాడు (1 కొరిం 16:2). ప్రతి ఒక్కరు తమ హృదయంలో నిశ్చయించుకొనిన ప్రకారం ఇయ్యవలెను (2 కొరిం 9:7). సువార్త సేవ, ఆర్థిక సహాయము మొ॥లగు సంఘపు బాధ్యతలు నిర్వహించవలెను. చందా ప్రతి ఆదివారం స్థానిక సంఘమునకు ఈయవలెను. మాసిదోనియలోనున్న

స్థానిక క్రీస్తు సంఘము నిరుపేదలైనను, తమ సామర్థ్యంకంటెను ఎక్కువ ఇచ్చిరి. వీటిద్వారా సంఘము అభివృద్ధి చెందును (2 కొరిం 8:1-5). స్థానిక సంఘమునందు నీవు ఏ స్థానమందున్నావు? నీవు ఏవిధంగా సహకరించుచున్నావు అనుదానికి ఈక్రింది ప్రశ్నలు వేసికొనవలెను. అవి:

నేను అండగా ఉంటినా ? దండుగగా ఉంటినా ?
నేను హాజరగువాడనా ? - ఎగ్గొట్టు వాడనా ?
సమాధాన పరచువాడనా ? - వివాదము పెట్టువాడనా ?
ఇచ్చేవాడినా ? - పుచ్చుకొనేవాడినా ?
బలవంతుడనా ? ఆత్మీయంగా బలహీనుడనా ?

సంఘము పని సన్నగిల్లినప్పుడు, క్షీణించినప్పుడు, పాటలు పాడుట దిగజారి పోయినప్పుడు, హాజరు తగ్గిపోయినప్పుడు మనము ఒకసారి ఆగి ప్రభువా దీనికి కారణము నేనా ? అని మనంతట మనము ప్రశ్నించుకొనవలయును (మత్తయి 26 : 22).

స్థానిక సంఘము ద్వారా అనేక ఆశీర్వాదములు పొందుచున్న నీవు, నేను దానికి ఋణపడియున్నాము. సంఘ కార్యక్రమములకు హాజరగుట, దానికి ఆర్థిక సహాయం చేయుటద్వారా నీ ఋణం తీర గలదు. స్థానిక సంఘములో నీవు ఏ స్థానమందున్నావు. నీ పాత్ర నీవు సరిగా నిర్వర్తించుచున్నావా ?

— దేవరపల్లి చిరంజీవి, కాకినాడ.

---

గమనిక : "నేనేల క్రీస్తు సంఘసభ్యుడనైతిని" అనే పుస్తకం చదివారా? లేకపోతే తప్పక చదవండి. 278 పేజీలుగల ఈ పుస్తకం వలయు వారు సత్యవాణికి Rs. 2-50 విలువగల పోస్టల్ స్టాంపులు పంపి వెంటనే పొందవచ్చును.

# బైబిలును సరిగ విభజించవలెనని అది నమ్ముచున్నది

## *(It Believes the Bible is a Book to be Rightly Divided)*

### I పరిచయము

బైబిలును సరిగ విభజించాలని పౌలు తిమోతిని ఆజ్ఞాపించాడు: "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కర లేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమో 2 : 15). చాలమంది బోధకులకు ఉపదేశకులకు బైబిలునుగూర్చి అట్టి భావన లేదు. పర లోక వర్తమానాన్ని సరిగ విభజించుటకు, లేక బోధించుటకు మానవుడు జాగ్రత్తపడాలని వారికి తెలియదు. మార్పు చెందుటనుగూర్చి తెలియజేయడానికి వారు కీర్తనల గ్రంథముదగ్గర కెళ్లు నడిపింతురో అట్లే అపొస్తలుల కార్యముల యొద్దకు నడిపింతురు.

### II పుస్తకముల విభజన

1. అందున్న పుస్తకములను సరిగ ఏర్పాటు చేయుటవలన బైబిలు పఠనము తేలిక యగును. పాత నిబంధనలో ముప్పయి తొమ్మిది పుస్తకములు, క్రొత్తనిబంధనలో ఇరవై యేడు పుస్తకములు ఉన్నవి.

2. పాతనిబంధనలో మనము చట్టము, చరిత్ర, పద్య కావ్యములు, ప్రవచనముల పుస్తకాలను కనుగొంటాము. బైబిలులోని మొదటి ఐదు పుస్తకములలో మోషే ధర్మశాస్త్రమున్నది గనుక అవి చట్టము లేక శాసనమని పిలువబడినవి. తరువాత పన్నెండు పుస్తకములు చరిత్రగా ఏర్పాటు చేయబడినవి. మరియు ఆరు పద్యకావ్య

ముల పుస్తకములున్నవి: యోబు, కీర్తనలు, సామెతలు, ప్రసంగి, పరమగీతము, విలాప వాక్యములు. పాతనిబంధనలో మిగిలిన పదహారు పుస్తకములు ప్రవచనమని ఏర్పాటు చేయబడినవి.

3. క్రొత్తనిబంధనలో సువార్తలు, మార్పుజెందినవారి చరిత్ర, పత్రికలు, ప్రవచనము అను భాగములున్నవి. మొదటి నాలుగు పుస్తకములు సువార్తలు అని చెప్పబడినవి. అపొస్తలుల కార్యములు మార్పు జెందినవారి చరిత్రయని తెలియబడుచున్నది. తరువాత ఇరవై యొక్క పుస్తకములు సంఘములకు, క్రైస్తవులకు వ్రాయబడిన ఉత్తరములు. ప్రకటన గ్రంధము ప్రవచన గ్రంధముగా ఏర్పాటు చేయబడినది.

## III యుగముల విభజన

ఈ యుగములను సరిగ విభజించటం అత్యావసరం. అవి సంఖ్యలో మూడున్నవి. అవేవన: పితరుల యుగము, యూదుల యుగము, క్రైస్తవ యుగము.

### i. పితరుల యుగము :

a) పితరుల యుగము కుటుంబముయొక్క లేక గోత్రముయొక్క యజమానునిబట్టి దానికాపేరు వచ్చినది. పితరుడు అనగా తండ్రియని అర్ధము. ఈ పద్ధతి ప్రకారము గోత్రకర్త ప్రవక్త యాజకుడు మరియు పాలకుడు. కుటుంబ వ్యవహారముల నతడు ఆత్మీయముగాను రాజకీయముగాను నడిపించే వాడు. దేవుడు కుటుంబ యజమానితో మాట్లాడే వాడు; ఆ యజమాని కుటుంబ సభ్యులతో మాట్లాడేవాడు.

b) ఇది కుటుంబ పద్ధతి ప్రకారమైన మతమని చెప్పబడినది. ప్రతి కుటుంబము దాని సొంత వ్యవహారాలను దేవుని నడిపింపుచొప్పున జరిగించుకొనుటకు స్వతంత్రత కలిగియుండెను. ఒక పితరుని కీయ్యబడిన ఆజ్ఞ, మిగిలిన పితరులకు శాసనముగా వర్తించి యుండలేదు. ఉదాహ

రణకు : దేవుడు నోవహును ఒక ఓడ నిర్మించుమని ఆజ్ఞాపించాడు, గాని మిగిలిన పితరులు అట్టి ఆజ్ఞను పొందలేదు. అబ్రాహాము తన కుమారుని అర్పించడానికి సన్నాహాలు చేయవలసినదని ఆజ్ఞాపింపబడ్డాడు గాని ఆ యాజ్ఞ మిగిలిన పితరులకు వర్తించలేదు.

c) వారిది లిఖింపబడిన మత పద్దతి కాదు. దేవుడు నోటి ద్వారా కుటుంబ యజమానితో మాటలాడెను.

d) ఈ మత పద్ధతి కనీసం ఇరవై అయిదు వందల సంవత్సరముల కాలముండెను. ఆదాము మొదలుకొని సీనాయి కొండదగ్గర మోషే ధర్మశాస్త్ర మియ్యబడేవరకు ఉండెను. అది అక్కడితో అంతముగాక ఆ తరువాత అన్యజనులకు మాత్రమే వర్తించినట్లు కనబడుచున్నది.

## ii. యూదుల యుగము :

a) అబ్రాహాముకు ఇయ్యబడిన ఐహిక ఆశీర్వాదమునుబట్టి ఈ పద్ధతి ఉద్భవించెను: "నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు" (ఆది 12 : 2). ధర్మశాస్త్రము ఈ వాగ్దానమునుంచి పెరిగినది. అది వాగ్దానము చేయబడిన నాలుగువందల ముప్పయి సంవత్సరముల తరువాత ఇయ్యబడెను (గలతీ 3:16, 17). ఆ వాగ్దానము నెరవేర్చబడునట్లు దేవుడు వారికొక పాలన పద్ధతిని, మోషే ధర్మశాస్త్రాన్ని యిచ్చాడు. అది వారిని రాజకీయముగాను, ఆత్మీయముగాను నడిపించెను.

b) యూదుల పద్ధతి లేక మోషే పద్ధతి మానవుని మొదటి లిఖితపూర్వక మత పద్ధతి. అబ్రాహాము సంతతివారు ఐగుప్తునుండి బయలువెడలి వచ్చినప్పుడు, సీనాయి కొండదగ్గరకు నడిపించబడిరి. రాతి పలకలపై వ్రాయబడిన పది యాజ్ఞలను దేవుడు వారికిచ్చాడు (నిర్గమ 19,20). అప్పటి నుండి మానవుని మతము గ్రంథస్థమైనది.

c) కుటుంబారాధన విస్తరింపజేయబడి జాతీయ పద్ధతిగా అభివృద్ధి జేయబడింది. ప్రతి కుటుంబ యజమాని పాలకునిగా రాజుగా ఉండుటకంటె, పాలనపద్ధతి గోత్రముల కప్పగించబడింది. యాజకత్వము కూడ అట్లే. యాజకత్వపు విధులకు ఒక గోత్రము ప్రతిష్ఠించబడెను. వారికి ఒకే జాతీయ బలిపీఠము, ఒకే దేవుని మందిరము ఉండెను.

d) యూదుల యుగముయొక్క ఒక ప్రయోజనం ఏమంటే, వాగ్దానము చేయబడిన సంతతి (క్రీస్తు) వచ్చువరకు అబ్రహాము సంతతిని ఒక ప్రత్యేకమైన జనాంగముగా నుంచుటయే (గలతీ 3:16-19). మోషే యుగముయొక్క ఈ విశిష్టమైన ప్రత్యేకత, యూదులను అన్యజనులను వేరుపరచిన మధ్యగోడ యని చెప్పబడెను (ఎఫెసీ 2:14).

e) ధర్మశాస్త్రము యొక్క మరియొక ప్రయోజనం, "అది రాబోవు మేలుల ఛాయగలది" (హెబ్రీ 10:1). దానికంటె ఎక్కువ మహిమగల రాబోవు పద్ధతిని వర్ణించుటకుగాను ప్రభువు ఈ పద్ధతిని రూపకముగాను, అలంకార రీతిగాను ఉపయోగించాడు. పౌలు ఇట్లనుచున్నాడు: "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" (1 కొరింథీ 10:11). అరణ్యములో వారి ప్రయాణము క్రొత్త నిబంధనలో దేవుని ప్రజలకు సారూప్యముగా నున్నది. ప్రత్యక్ష గుడారము, దేవాలయము ప్రస్తుత యుగములోయున్న సంఘమునకు గురుతుగా నున్నవి. ధర్మశాస్త్ర ప్రకారము యర్పింపబడు గొర్రెపిల్ల, ఈ లోక పాపములకొరకు అర్పింపబడిన దేవుని గొర్రెపిల్లయైన క్రీస్తును సూచించుచున్నది. ఈ రెండు పద్ధతులను వర్ణించుటకొరకు పౌలు, హాగరు, ఇష్మాయేలు, శారా, ఇస్సాకులను ఉదాహరణగా వినియోగించాడు. రాబోవు క్రీస్తుకు గురుతుగా మోషే యున్నాడు. నిజంగా, క్రైస్తవ మతమును గ్రహించుకొనగోరువాడు మోషే ధర్మశాస్త్రమును గ్రహించుకోవాలి.

**f)** ధర్మశాస్త్రముయొక్క మరియొక ప్రయోజనం యేమంటే మానవుని క్రీస్తునొద్దకు నడిపించుటకది ఒక బాలశిక్షకునిగా పనిచేసెను (గలతీ 3:24). క్రీస్తును ఆయన సువార్తను అంగీకరించుటకు ఈ లోకము సిద్ధపడి యుండలేదు. ఈ బాలశిక్షకుడు (ప్రాథమిక ఉపాధ్యాయుడు) మానవులకు శిక్షణయిచ్చి, విద్యగరపి క్రీస్తునొద్దకు వారిని తీసికొని రావలెను. మొదటి నిబంధన మనకు శిక్షణ గరుపుటవలన మనము రెండవదానికొరకు సంసిద్ధులమైతిమి.

**g)** ధర్మశాస్త్రము లోపముగలది: "ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవదానికి అవకాశముండనేరదు" (హెబ్రీ 8:7). ధర్మశాస్త్రము బలహీనమైనదని కూడ పౌలు చెప్పుచున్నాడు: "ఎట్లనగా ధర్మశాస్త్రము దేనిని చేయజాలకపోయెనో దానిని దేవుడు చేసెను. శరీరము ననుసరింపక ఆత్మ ననుసరించియే నడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతి విధి నెరవేర్చబడవలెనని పాపపరిహారము నిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాప శరీరాకారముతో నంపి, ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను" (రోమా 8:2-4). దానియందు కనబడు బలహీనత ఒకటి యేమంటే పాపములయొక్క, అతిక్రమములయొక్క పూర్ణ క్షమాపణ లేదు. దేవుని బలిపీఠముపై అర్పించబడుచుయుండే బలులు పాపములను ఏటేటా ముందుకు కొనసాగించుచుండెను. పాపమునుగూర్చి వారు ప్రతి నిత్యము జ్ఞప్తి కలిగియుండిరి; "ఏలయనగా ఎడ్లయొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:1-4).

**h)** యూదుల యుగము తాత్కాలికమని దేవుడు నిర్దేశించాడు. "ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు" అది ఉండవలసి వచ్చెను (గలతీ 3:19). ఆ సంతానమెవరో మనము ఊహించుకోనక్కరలేదు, ఏల యనగా పౌలు "ఆ సంతానము

క్రీస్తు" అని చెప్పాడు (గలతీ 3:16). గనుక ధర్మశాస్త్రము క్రీస్తువలన సమాప్తి చేయబడవలసి యుండెను.

### iii. క్రైస్తవ యుగము :

a) ఈ పద్ధతి అబ్రాహామునకు చేయబడిన ఆత్మీయాశీర్వాదము నుండి ఉద్భవించినది: "భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును" (ఆది 12 : 3). ఈ వాగ్దానము మరల ఈ మాటలతో చేయబడుట చూడగలము : "భూలోకములోని జనములన్నియు నీ సంతానమువలన ఆశీర్వదించబడును" (ఆది 22 : 18). అబ్రాహాము సంతతినుండి వచ్చువానివలన భూమియొక్క సమస్త వంశములు, సమస్త జనములు ఆశీర్వదింపబడవలసి యుండెను. ఆయనే మన కొరకై చనిపోయి, శ్రేష్టమైన నిబంధనకు మధ్యవర్తియైన క్రీస్తు.

b) యిర్మియా ప్రవచించిన క్రొత్తనిబంధన యిదే: "ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదా వారితోను క్రొత్తనిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యిపట్టుకొనిన దినమున వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి; యిదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే; వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయము మీద దాని వ్రాసెదను; యెహోవా వాక్కు యిదే. నేను వారికి దేవుడనై యుందును. వారు నాకు జనులగుదురు" (యిర్మియా 31:31-34). క్రొత్తనిబంధనను గూర్చిన ఈ ప్రవచనము నెరవేర్చబడెనని పౌలు ప్రకటించాడు (హెబ్రీ 8:6-13). గనుక దేవుడు మనకొరకు క్రొత్తనిబంధన నిచ్చాడు, మరియు నేడు మనము దానిక్రింద జీవించుచున్నాము.

c) యాజకులు మార్చబడినందున యాజక ధర్మము మార్చబడవలసి వచ్చెను. "యాజకులు మార్చబడిన యెడల అవశ్యముగా యాజకధర్మము సహా మార్చబడును" (హెబ్రీ 7:12) క్రొత్త యాజకులలో యేసుక్రీస్తు ప్రధాన యాజకుడు (హెబ్రీ 9 : 11). మరియు దేవుని పిల్లలందరు యాజకులు (1 పేతురు 2:5). యాజకులు మార్చబడినందున, యాజక ధర్మము మార్చబడవలసి వచ్చెను. అందువలన యూదుల కియ్యబడిన ధర్మశాస్త్రమునకు వేరైన మరొక ధర్మశాస్త్రము క్రింద మనము జీవించుచున్నాము.

d) క్రీస్తు మొదటిదానిని కొట్టివేసి రెండవదానిని స్థిర పరచుటకు వచ్చాడు (హెబ్రీ 10 : 9). ఆయన వచ్చుటలో యున్న ఉద్దేశములలో ఇది యొకటి. ఆ రెండవది స్థిరపరచబడింది, గనుక మొదటిది ఎత్తివేయబడింది.

e) ధర్మశాస్త్రమును సిలువకు మేకులతో కొట్టివేయుటవలన క్రీస్తు దాన్ని ఎత్తివేసాడు : "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీది చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" (కొలస్స 2 : 14). క్రీస్తు ధర్మశాస్త్రమునకు లోబడినవాడై జన్మించెను (గలతీ 4:4, 5). జీవించెను చివరకు దానిని నెరవేర్చుటకు దానికి లోబడినవాడై మరణించెను (మత్తయి 5:17). క్రీస్తు పాతనిబంధన ప్రకారము జీవించి మరణించెను. ఆయన మరణమునకు ముందు సంభవించిన సంగతులు క్రొత్తనిబంధన అమలులోనికి రాకముందు సంభవించెను.

f) క్రీస్తు మరణమయ్యేవరకు క్రొత్తనిబంధన అమలులోనికి రాలేకపోయెను : "మరణ శాసన మెక్కడ ఉండునో అక్కడ మరణ శాసనము వ్రాసినవాని మరణము అవశ్యము. ఆ శాసనమును వ్రాసిన

వాడు మరణమొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించు చుండగా అది ఎప్పుడైనా చెల్లునా?" (హెబ్రీ 9:19,17). దీన్ని మనం గ్రహించుకోవచ్చు, అది తరుచు నిరూపించబడడం మనం చూస్తూనే యున్నాము. వీలునామా, లేక మరణశాసనము వ్రాసినవాడు చని పోయేవరకు అది చెల్లుబడి కాదని మన మెరుగుదుము. మన రక్షకుని నిబంధనను గూర్చి పౌలు అదే సంగతిని చెప్పుచున్నాడు. సిలువపై క్రీస్తు మరణము ధర్మశాస్త్రమును నెరవేర్చి అంత మొనర్చింది (కొలస్స 2:14). అటుతరువాత క్రైస్తవయుగము అమలులోనికి వచ్చింది.

g) క్రైస్తవయుగము అన్ని జనాంగములవారికి ఇయ్యబడింది: "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి" (మత్తయి 28:19). "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16 : 15). యూదులకు అన్యజనులకు మధ్యనున్న గోడ పగులగొట్టబడెను (ఎఫెసీ 2 : 14). వారుభయులు ఒకే శరీరమందు ఇప్పుడు దేవునితో సమాధానపరచ బడిరి (ఎఫెసీ 2:16). ఆ శరీరమే సంఘము. గనుక "ఇందులో యూదు డని గ్రీసు దేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు" (గలతీ 3 : 28).

h) క్రైస్తవ యుగంలో నేడు మనము క్రీస్తుకు విధేయుల మవ్వాలి. మోషే ఇల్లు ప్రవచించాడు: "నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నావంటి ప్రవక్తను నీ సహోదరులలో నీ కొరకు పుట్టించును, ఆయన మాట నీవు వినవలెను" (ద్వితీ 18:6). ఈ ప్రవచనము నెర వేర్చబడినదని పేతురు బోధించుచున్నాడు; మరియు "ఆ ప్రవక్త మాట వినని వాడు ప్రజలలో ఉండకుండ సర్వనాశన మగును" (అపో.కా.3:22, 23). రూపాంతరము దగ్గర యిది పునరుద్ఘాటించబడింది. యేసు రూపాం తరము పొందాడు. మోషే ఏలియాలు కూడ అక్కడ కనబడిరి.

వారిలో ఒక్కొక్కరికి ఒక గుడారమును పేతురు నిర్మించాలనుకొన్నాడు. అయితే దేవునియొక్క ఈ మాటలవలన అతని సంకల్పము విచ్ఛిన్నమైనది: "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను; ఈయన మాట వినుడి" (మత్తయి 17:5). మానవుడు మోషే, ఏలీయాల మాట వినేకాలమొకటి యుండెను, గాని యిప్పుడైతే అతడు దేవుని కుమారుని మాట వినవలెను. పౌలు ఇట్లనుచున్నాడు: "పూర్వకాలమందు నానాసమయములలోను నానా విధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాటలాడెను" (హెబ్రీ 1:1,2).

---

## " నోవహు దినములు ఏలాగుండెనో.... "

### (As the Days of Noah were ...)

నోవహును గూర్చి బైబిలు నీతిపరుడని, నిందారహితుడని, దేవునితో నడచిన వాడని చెప్పుచున్నది (ఆది 6 : 9). అట్లు చెప్పబడిన వారిలో ఇతడు రెండవవాడు. భూమి మీద నరులును వారితో దుర్మార్గతయు విస్తరించినట్లు ఆదికాండము 6వ అధ్యాయములో చూడగలము. తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది వారిని భూమి మీద నుండకుండ తుడిచి వేయుదు ననుకొనెను. అయితే నోవహు యెహోవా దృష్టియందు కృపపొందినవాడాయెను (ఆది 6:7, 8). నోవహు, అతని కుటుంబము రక్షింపబడునట్లును, సమస్త జీవులు బ్రదికింపబడునట్లును ఒక ఓడ నిర్మించు మని దేవుడు నోవహుకు ఆజ్ఞ యిచ్చాడు.

జలప్రళయమునకు ముందటి దినములలో రెండు రకములైన ప్రజలను మనము చూచుచున్నాము: నోవహు కుటుంబము మరియు ఈ లోకస్థులు. "విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగ

తులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి ... ఒక ఓడను సిద్ధము చేసెను" అని హెబ్రీ 11:7లో మనము చూడగలము. జలప్రళయం వచ్చి లోకాన్ని నాశనం చేస్తుందని నోవహు విశ్వసించాడు; 120 సంవత్సరముల మట్టుకు ఓడను నిర్మించాడు: ఆనాటి అక్రమ జనాంగము యెడల 120 సంవత్సరముల మట్టుకు దేవుడు ఎందుకు శాంతము వహించాడు! ఒక్క-రోజులో సొదొమ గొమొర్రాలను నాశనం చేసేసినట్లు ఆయన వారిని నాశనం చేయగల్గును; గాని ప్రతివాడు రక్షింపబడాలని ప్రభువు కోరుచున్నాడు. నోవహు తన పనితో ఆనాటి ప్రజలకు ఉపదేశించాడు. అదృశ్యమైనవి యున్నవనుటకు తనకున్న ఋజువును అతడు వారికి చూపాడు. వారు మారుమనస్సు పొంది ఆయన తట్టుతిరగాలని దేవుడు కోరాడు. నోవహును ఉదాహరణగా వారి యెదుట ఉంచాడు.

రెండవదిగా, ఆనాటి లోకస్థులు బలాత్కా-రముతో నిండియుండిరి. దేవునినుండి దూరమైరి. నోవహు ఓడను నిర్మించుచున్నాడుగాని వారతని హేళన చేసారు. నోవహు తన క్రియల ద్వారా వారికి బోధించాడుగాని వారతని నమ్మలేదు. యేసు చెప్పినట్లు వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచునుండిరి. వారికి అంతా మామూలుగా నేయున్నది; కనుక హెచ్చరిక యేమి లెక్క-చేయలేదు.

క్రీస్తు రెండవ రాకడముందు కూడ నోవహు దినములలో ఏలాగుండెనో ఆలాగే యుంటాదని యేసుప్రభువు చెప్పాడు. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు ప్రజలు ఏలాగుండిరో ఆలాగే మనుష్యకుమారుని రాకడయుండును (మత్తయి 24:37-39).

మనము అంత్యదినములలో, ప్రభువు రెండవరాకడకు ముందున్న దినములలో ఉన్నామని ఎరుగుదుము. ఇప్పుడు కూడ

రెండు రకములైన ప్రజలనే మనము కనుగొనగలము. నోవహువలె అదృశ్యమైన వాటి రుజువును కలిగినవారు, ఈ లోకస్థులు. ప్రభువు మరల వచ్చుచున్నాడు, మనమాయనను కలసికొనబోవుచున్నాము. ఈ దృఢ విశ్వాసము కలిగిన వారు రక్షింపబడుదురు, గాని ఈ లోకస్థులైతే జలప్రళయమునాటి లోకస్థులవలె నాశన మొందుదురు.

నీవు ఏ తరగతికి చెందుదువు? మొదటివారిలోనా, రెండవ వారిలోనా? రక్షింపబడగోరుచున్న యెడల నీ యిష్టాన్ని బట్టిగాక దేవుని ఆజ్ఞలనుబట్టి నీ జీవిత నౌకను నిర్మించుకో, అది విశ్వాసమువలన మాత్రమేగాక, క్రియల మూలముననుజరిగించు (యాకో 2 : 17). ఈతరము వారిలో నోవహువలె యుండు నిమిత్తము ప్రభువు మనల నుంచాడు. మన జీవితంలో అదృశ్యమైన వాటి - రుజువును ప్రజలు కనుగొనునట్లు ప్రభువు మనలనుంచాడు. నీ వెట్లు నిర్మించుచున్నావు? "ప్రతివాని పని బయలు పరచబడును" (I కొరి 3:13).

జలప్రళయమునకు ముందటి తరమువారి యెడల ప్రభువు ఎట్లు శాంతము వహించాడో, ఈతరము వారి యెడల కూడ ఆయన శాంతము వహించాడు. అయితే "ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2 పేతు 3 : 9). గనుక మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి (ఆమోసు 4 :12).

— కవిత గూటం.

నలుగకుండ సెమరు వేసిన మీ వవ్యనాజ్యతను
పలుకకుండ ఎలా మనగలము
అలసి సొలసి సొమ్మసిల్లే ఈలోకం వదలి
సువర్ణ సునీయ సూర్యకాంత
కాంతులీనె ప్రకాశమైన ప్రియుని రాజ్యంలోకి
ప్రభువు తన ప్రియులైన మిమ్ముమ పిలుచుకోగా
మీవెంట కొనిపోయిన మీక్రియల ప్రత్యేకతను
ప్రశంసించక ఎలా మరువగలము

ఇలా తలచిన కొలది తరచి తరచి వచ్చే
మీప్రేమ జల్లుల స్మృతులు
మీ విశ్వాస విజయాల అనుభూతులు
మిగల్చబడిన మా జీవితాలలో
గొప్ప చైతన్య స్రవంతులై
మీరక్తం పంచుకు పుట్టిన ప్రతిబిడ్డ
ఈ గడ్డపై మీ మార్గంలోనే పయనిస్తూ
మరల మిమ్మును మహిమలో చూడగలమనే
మహత్తర మహోన్నత నిరీక్షణలో .... ....

మీ వనంలోని ఓ పుష్ప విలాపం.

---

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..............................................
..............................................
..............................................
..............................................